చైర్మన్ పదవి వరించేదెవరినో?



చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

- ఆశావహుల ఎదురుచూపు
- చెన్నూర్ మార్కెట్ కమిటీ నియామకంలో జాప్యం

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మార్కెట్ కమిటీల నియామకం పూర్తయినా చెన్నూర్‌లో మాత్రం జాప్యం జరుగుతూ వస్తోంది. పార్టీ కోసం కష్టపడిన నేతలు నామినేటెడ్ పదవి కోసం గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది చివరి నాటికైన చైర్మన్ పదవి వరిస్తుందా అని పలువురు కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు.

బీసీల్లో పోటీ..

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీకి కేటాయించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన చెన్న సూర్యనారాయణ, ముత్యాల బాపగౌడ్, గజ్జెల అంకగౌడ్, మహేశ్ ప్రసాద్ తివారి పోటీపడుతున్నారు. వీరితోపాటు మరికొందరు బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎవరికి వారే లాబీయింగ్ చేస్తున్నారు. మొదటి నుంచి పార్టీ పటిష్టత కోసం పని చేసిన నాయకులకు చైర్మన్ పదవి ఇవ్వాలని కార్యకర్తలు కోరుతున్నారు. నామినేటెడ్ పోస్టు కావడంతో ఎమ్మెల్యే ఎవరి పేరు ఖరారు చేస్తారోనని బీసీ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఆదాయంలో చెన్నూర్‌కు పేరు

జిల్లాలోనే ఆదాయం తెచ్చిపెట్టే వ్యవసాయ కమిటీగా చెన్నూర్‌కు పేరుంది. 2018–19 సంవత్సరానికి రూ.3.22 కోట్లు, 2019–20కు రూ.2.26 కోట్లు, 2020–21 రూ.2.90 కోట్ల ఆదాయం వచ్చింది. 2021–22 రూ.4.35 కోట్లు, 2022–23 రూ.3.53 కోట్లు, 2023–24 రూ.6.06 కోట్లు చొప్పున ఆదాయం సమకూరింది. ఇదిలా ఉంటే చెన్నూర్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తోడ్పడే వ్యక్తికి చైర్మన్ పదవి దక్కుతుందా లేక మండలేతర నాయకులకు వరిస్తుందా అని పలువురు చర్చించుకుంటున్నారు.

రైతు నేపథ్యం ఉన్న వారికి..

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రైతు నేపథ్యం ఉన్నవారికి ఇవ్వాల్సి ఉంటుంది. అయినప్పటికి సమస్యలు తెలిసిన వారికే ఇస్తే అన్నదాతలకు మేలు చేకూరుతుందని పలువురు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే తన అనునాయులకు పదవి కట్టబెట్టి చేతులు దులుపుకుంటారా, రైతులకు మేలు చేసే వ్యక్తికే చైర్మన్ పదవి ఇస్తారా అని వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంచాలి


మాట్లాడుతున్న ఎంఈవో పోచయ్య

బెల్లంపల్లి: విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఎంఈవో పోచయ్య అన్నారు. బెల్లంపల్లిలోని నెంబర్–2 ఇంక్లైన్‌బస్తీ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో రూమ్ టూ ఇండియా ట్రస్ట్ ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ఎంఎన్‌వో లింగయ్యతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. ప్రాథమికస్థాయిలో విద్యార్థులకు చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దేందుకు జిల్లాలో రూమ్ టూ రీడర్ ఇండియా ట్రస్ట్, యూఎస్ఏఐడీ సహకారంతో మండలానికో మోడల్ లైబ్రరీ ఏర్పాటు చేశారన్నారు. మోడల్ లైబ్రరీలో రంగురంగుల కథల పుస్తకాలు, పఠన సామగ్రి సరఫరా చేసినట్లు తెలిపారు. రూమ్ టూ రీడ్ జిల్లా లీడ్ మధు, బెల్లంపల్లి మండల హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


రోడ్డు పరిశీలిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: జాతీయ రోడ్డుపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రమాదాలు జరిగే పలు ఏరియాలను జాతీయ రహదారి అధికారులతో కలిసి సోమవారం గుర్తించి పరిశీలించారు. పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, లైటింగ్ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్లపైకి పశువులు రాకుండా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై రాజశేఖర్, అధికారులు సునీల్, మహేశ్ ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జన్నారం: మండల అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఆదేశాలతోనే మండల కేంద్రంలోని కిష్టాపూర్ టీజీబీలో సోమవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. బ్యాంకుల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాలిన్న జాగ్రత్తలను సిబ్బంది వివరించారు. బ్యాంకు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మంచిర్యాలక్రైం: పట్టణంలోని చున్నంబట్టివాడలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యుడు గురువయ్య ప్రారంభించారు. అనంతరం 150 మందికి వైద్యసిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికవర్ సెంటర్ హెడ్ కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, హరీశ్ పాల్గొన్నారు.

మోడల్ గ్రంథాలయం ప్రారంభం

భీమారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మోడల్ గ్రంథాలయాన్ని ఎంఈవో సురేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థా యిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయ డం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చి దిద్దేందుకు రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో మండలానికి ఒక మోడల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తోందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం విక్రమ్, హెచ్ఎం కైలాసం పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక బైపాస్‌రోడ్ అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. నరకాసురవధ కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ రాజమణి ఉన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయుద్దు


అటవీప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువులను ఏరుతున్న అధికారులు

కాసిపేట: అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయుద్దని బెల్లంపల్లి అటవీశాఖ క్షేత్ర అధికారి సీహెచ్ పూర్ణచందర్ పేర్కొన్నారు. కాసిపేట, తాండూర్, బెల్లంపల్లి మండలాల సరిహద్దులోని బుగ్గ ఆలయ అటవీ పరిసరాల్లో సోమవారం ఆలయ సిబ్బంది, భక్తులతో కలిసి ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడేసిన ప్లాస్టిక్ వస్తువులను వన్యప్రాణులు, పశువులు తిని వ్యాధిబారిన పడి మృత్యువాతపడుతున్నాయని తెలిపారు. అటవీప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా స్టీల్ ప్లేట్లు, ఇతర వస్తువులు వాడాలని భక్తులకు అవగాహన కల్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి స్టీల్ ప్లేట్లు వినియోగించారు. డెప్యూటీ రేంజ్ అధికారులు ప్రవీణ్‌నాయక్, తిరుపతి, శ్రీనివాస్, బీట్ అధికారులు యుగేందర్, రాజు, శంకర్, శ్రీధర్, గోపి, వెంకటేశ్, భాస్కర్, ఆలయ ఈవో బాపురెడ్డి పాల్గొన్నారు.

‘మార్కెట్‌కు వెంకటస్వామి పేరు పెట్టడం సరికాదు’



మార్కెట్ ముందు నినాదాలు చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొత్తగా నిర్మాణం చేసిన సమీకృత కూరగాయల మార్కెట్‌కు కేంద్రమాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) పేరు పెట్టడం సరికాదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కూరగాయల మార్కెట్ ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సమావేశంలో కాకా పేరును ప్రతిపాదిస్తూ చేసిన తీర్మానాన్ని భేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌కు బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడానికి ఎమ్మెల్యేతో సహా సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేయాల్సింది పోయి కాంగ్రెస్ నాయకుడి పెట్టడం అనాలోచిత నిర్ణయమని తెలిపారు. అధికారులు, కౌన్సిలర్లు పునరాలోచించి అంబేద్కర్ పేరు పెట్టాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్, నాయకులు ఎ.రమేశ్, సతీశ్, సాయి, శేఖర్, అరుణ్, రాకేశ్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు


చెన్నూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చెన్నూర్: రాష్ట్రప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు నాలుగు డీఏలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం తపస్ నాయకులతో కలిసి తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు డీఏలో పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వం ఒక్క డీఏ మాత్రమే ప్రకటించిందన్నారు. పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 50 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలన్నారు. జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ రుణాల కోసం రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న నేటికి మోక్షం లేదన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లుల విడుదలతో జాప్యం చేస్తే నవంబర్ 5 నుంచి జిల్లాస్థాయిలో ధర్నా నిర్వహిస్తామని, అయినా సర్కారు దిగిరాకపోతే 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద దీక్ష చేస్తామని హెచ్చరించారు. తపస్ నాయకులు నాగరాజు, శ్రీకాంత్, సురేశ్ పాల్గొన్నారు.

భీమిని: తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు సోమవారం భోజన విరామ సమయంలో డిప్యూటీ తహసీల్దార్ జోగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బండి రమేశ్ మాట్లాడుతూ ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వం ఒక డీఏ ప్రకటించడం అన్యాయమన్నారు. మండల అధ్యక్షుడు అరిశాల శ్రీరాములు, మోహన్, శ్రీకాంత్, సతీశ్ పాల్గొన్నారు.

నెన్నెల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తపస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేశ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. జిల్లా మీడియా కన్వీనర్ ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నేతలు గౌరయ్య, మహేందర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలో ప్రధాన వీధుల్లో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగా లను కొనియాడారు. ఎస్సై సుబ్బారావు, పోలీసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ మాదిరిగా వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్‌లో పుట్టిన తేదీ వివరాలు తప్పుగా నమోదు కావడంతో ఖాతాలో డబ్బులు జమ కావడం లేదన్నారు, అనారోగ్యంతో పనులు చేయలేని కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. కార్మిక యూనియన్ అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, ఉపాధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

భీమారం: మండలంలోని రెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో మధుసూధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల పిల్ల లను కేంద్రాలకు పంపేలా తల్లిదండ్రులతో మాట్లాడాలని అంగనీవాడీ టీచర్‌ను ఆదేశించారు.

పత్తిలో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని చెన్నూర్, కత్తెరసాల గ్రామాల్లో పత్తి పంటలో నాణ్యతా ప్రమాణాలపై జిల్లా వ్యవసాయాధికారి కల్పన సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించాలని తెలిపారు. మట్టి నమూనాలు సేకరించి పోషకాల లభ్యత అనుగుణంగా ఎరువుల మోతాదును వాడాలన్నారు. అలాగే రైతులు పీఎం కిసాన్ కేవైసీ చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త రాజమణి, ఏడీఏ బానోతు ప్రసాద్, ఏవో మార్క్ గ్లాడ్‌స్టన్, ఏఈవోలు సాగర్, రాజశేఖర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

స్పందించారు..పరిష్కరించారు

సాక్షి స్పందన

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ తీగలు ప్రజల పాలిట ప్రమాదకరంగా మారాయని ‘మృత్యు పాశాలు’శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఏడీఈ వేణు గోపాల్, ఏఈలు.. హాజీపూర్ మండలం ముల్కలలోని పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ‘సాక్షి’కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


ముల్కలలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న అధికారులు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: సింగరేణి సంస్థలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల బాలిక హాస్టల్ ప్రాంగణంలో స్టడీ హాల్, గార్డెన్, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన నూతన ఆర్వో ప్లాంట్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఎస్ఓటూ జీఎం ఎన్.సత్యనారాయణ, ఏఐటీయూసి బ్రాంచి సెక్రటరీ బాజీసైదా, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు మురళీధర్, అరవిందరావు, ఆనంద్‌కుమార్, చిరంజీవులు, వెంకటేశం, జక్కారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయండి

నస్పూర్: విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికి తీయడానికి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 7 నుంచి నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న కోరారు. సీసీసీలోని ప్రైవేటు పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టుకు సంబంధించి పోస్టర్లను హెచ్ఎంలతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7న పాఠశాల, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులు ఉంటాయన్నారు. జిల్లాలో 8,9,10 తరగతి విద్యార్థులు ఈ టెస్టులో పాల్గొనాలని కోరారు. హెచ్ఎంలు ఉపేందర్, తిరుపతి, అమన్‌ప్రసాద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ శ్రేణుల నిరసన


నినాదాలు చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: జన్వాడలో మాజీమంత్రి కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన విందు కార్యక్రమాన్ని ప్రభుత్వం వివాదాస్పదం చేయడంపై పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బీఆర్ఎస్వీ శ్రేణులు నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీ.. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. నాయకులు తదితరులు ఉన్నారు.

‘మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ ఖండిస్తున్నాం’

చెన్నూర్: జన్వాడలో సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు చొరబడే ప్రయత్నాన్ని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన అరెస్ట్ హేయమైన చర్య అని అన్నారు. నాయకులు జడల మల్లేశ్, కొప్పుల ప్రభాకర్, నయబ్, జడల వెంకటేశ్వర్, నెన్నల భీమయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. రాళ్లవాగు వంతెనకు ఇరువైపులా కరకట్ట నిర్మాణ కోసం రూ.255 కోట్ల నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు, వార్డు సభ్యుడు ప్రకాశ్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బెక్కం రాజారావు, పూరెళ్ల సంపత్, ఆవుల సాయి పోరెడ్డి సంధ్య, సాదుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

భీమిని: కన్నెపల్లి మండలం చింతపూడి ప్రాథమిక పాఠశాల నుంచి బెల్లంపల్లి మండలం మాలగురిజాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు గంగాధర్‌ను సోమవారం గ్రామస్తులు సన్మానించారు. మాజీ సర్పంచ్ లక్ష్మీతిరుపతి దంపతులు, మాజీ ఉప సర్పంచ్ సతీశ్, స్కూల్ కమిటీ చైర్మన్ అజహర్, సీఆర్పీ ముడిమడుగుల నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న గంగారెడ్డి

చెన్నూర్: పట్టణంలో నిర్దేశించిన లక్ష్యాన్ని మించి బీజేపీ సభ్యత్వ నమోదు కావడం శుభపరిణామమని పార్టీ సభ్యత్వ నమోదు ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదుపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా సభ్యత్వ నమోదు కోకన్వీనర్ అక్కల రమేశ్, చెన్నూర్ పట్టణ ఇన్‌చార్జి మధు, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, తిరుపతి, శంకర్, రాజ్‌కుమార్, వెంకటనర్సయ్య, కొండపాక చారి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో భాగస్వామ్యులను చేయాలి

కోటపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదులో అందరిని భాగస్వాములు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గంగారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సభ్యత్వ నమోదులో కన్వీనర్ కృష్ణమూర్తి, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి పాల్గొన్నారు. ఉపాధ్యక్షుడు పున్నం చందు, నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ వెంకటేశ్వర్లు

నస్పూర్: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ పోలీసుల ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ నుంచి ఆర్‌కే 6 కొత్త రోడ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, శ్రీరాంపూర్ ఎస్సై ఎం.సంతోష్, జైపూర్ ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాణాసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

మందమర్రిరూరల్/కాసిపేట: దీపావళి పురస్కరించుకుని సర్కిల్ పరిధిలోని బాణాసంచా దుకాణాల వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న వ్యాపారులు టపాసులు, సామగ్రి ఉన్నచోట ఫైర్‌సేఫ్టీ అందుబాటులో ఉంచాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా అనధికారికంగా టపాసులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏరియాలో నియర్ బై ఫుట్‌బాల్ పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో డబ్ల్యూపీఎస్ అండ్‌జీఏ ఆధ్వర్యంలో నియర్‌బై ఏరియా ఫుట్‌బాల్ పోటీలు సోమవారం జరిగాయి. ఈ పోటీలను కేకే–డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు ప్రారంభించారు. పోటీల్లో మందమర్రి గ్రూపు జట్టు బెల్లంపల్లి గ్రూపు జట్టు తలపడగా మందమర్రి జట్టు గెలిచింది. అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట సమీపంలోని అర్బన్ పార్కు ముందు అటవీ అధికారులు వాహనదారులు, ప్రయాణికులకు సోమవారం అవగాహన కల్పించారు. రోడ్డు మార్గంలో వెళ్లేప్పుడు కోతులకు ఎలాంటి ఆహారం తినుబండారాలను వేయొద్దన్నారు. అలా వేస్తే కోతులు ఆహారం కోసం రోడ్డుపై ఉండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయని తెలిపారు. డీఎఫ్‌వో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వోలు అప్పలకొండ, సదానం, డిప్యూటీ రేంజ్ అధికారులు ప్రభాకర్, నందిని, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు బతుకమ్మ చీరలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కర్ణమామిడిలో సోమవారం డ్వాక్రా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ మహేందర్, సింగిల్ విండో చైర్మన్ సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారావు, వెంకటేశ్ సతీశ్, సత్తయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ


విచారణలో పాల్గొన్న డీఎల్‌పీవో ధర్మరాణి

జైపూర్: మండలంలోని మిట్టపల్లి పంచాయతీ కార్యదర్శి జి.ప్రవీణ్‌పై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై డీఎల్‌పీవో ధర్మరాణి సోమవారం విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజల సమక్షంలో విచారించారు. విధుల పట్ల కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీవో తెలిపారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, నాయకులు పాల్గొన్నారు.